ప్రజాశక్తి

శనివారం 7 సెప్టెంబర్ 2024

వరద బాధితుల కోసం ఆర్థిక సాయం అందజేస్తున్న కార్మికులు

బెవరేజేస్ కార్మికుల ఆర్థిక సాయం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయవాడ వరద బాధితుల సహాయార్థం జిల్లాలో గల ఎపి బెవరేజిస్ కార్మికులు రూ.7400 ఆర్థిక సాయం అందించారు. ఆ యూనియన్ గౌరవాధ్యక్షులు రెడ్డి శంకరరావు ద్వారా ఈ మొత్తాన్ని అందజేశారు.

జిల్లాలో జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఇంటింటా రోగులు జ్వరాల బారినపడి అల్లాడుతున్నారు. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఫలితంగా ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. ఆసుపత్రులకు వచ్చే రోగుల్లో కొందరు ఇన్ పేషెంట్లుగా చేరుతుండగా మరికొందరు ఔట్ పేషెంట్లుగా చికిత్స తీసుకుని ఇళ్లకు వెళ్లిపోతున్నారు. వైరల్ జ్వరాలతో పాటు డెంగీ, మలేరియా కేసులు కూడా ఎక్కువగానే నమోదు అవుతున్నాయి. దీంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ఈనేపథ్యంలో జిల్లా కేంద్రాస్పత్రికి రోగుల తాకిడి రోజురోజుకూ పెరుగుతోంది.

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జ్వరపీడితులు

జిల్లా కేంద్రాస్పత్రిలో నమోదైన కేసులు

నెల	మొత్తం కేసులు	డెంగీ	మలేరియా
జనవరి	30,275	120	313
ఫిబ్రవరి	32,802	121	321
మార్చి	30,752	85	291
ఏప్రిల్	30,980	89	287
మే	30,517	87	229
జూన్	33,707	91	319
జూలై	37,297	163	572
ఆగస్టు	36,184	164	1207

విజృంభిస్తున్న జ్వరాలు

- రోగులతో కిక్కిరిస్తున్న ఆస్పత్రులు
- పెరిగిన డెంగీ, మలేరియా కేసులు
- గత నెలలో 164 డెంగీ కేసులు నమోదు

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలో వర్షాలు కురుస్తుండడం, గ్రామాల్లో అపారిశుధ్యం కారణంగా ప్రజలు జ్వరాలు బారిన పడుతున్నారు. వైరల్ జ్వరాలతో పాటు దోమకాటు వల్ల వచ్చే డెంగీ, మలేరియా కేసులు కూడా జిల్లాలో పెరుగుతున్నాయి. జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఇన్‌పేషెంట్లుగా చేరుతున్న రోగుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఔట్ పేషెంట్ల సంఖ్య కూడా గతం కంటే గణనీయంగా పెరిగింది. గతంలో రోజుకు సుమారు వెయ్యి మంది రోగులు రాగా, నేడు 15వందల మంది వరకు ఆస్పత్రిలో వైద్యం కోసం వస్తున్నారు. అయితే అందుకుతగ్గ ఏర్పాట్లు ఆస్పత్రిలో లేవు. తగినన్ని బెడ్‌లు లేకపోవడంతో ఒక్కో మంచంపైనా ఇద్దరేసి పేషెంట్లు ఉండాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. వర్షాలు ప్రభావం ఎక్కువగా ఉండటంతో ఇంకా కేసులు పెరిగే అవకాశం ఉంది. ప్రతి గ్రామంలోనూ, ప్రతి ఇంట్లోనూ జ్వర పీడితులు ఉన్నారు. రోజురోజుకు కేసులు పెరుగుతున్నాయి గతంలో మలేరియా కేసులు గిరిజన ప్రాంతాల్లో ఎక్కువగా నమోదయ్యేవి. ప్రస్తుతం మైదాన ప్రాంతాల్లో కూడా మలేరియా కేసులు అధికంగా నమోదు కావడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

జిల్లాకేంద్రాస్పత్రిలో చేరిన రోగులు

జనవరి	2230
ఫిబ్రవరి	2395
మార్చి	2016
ఏప్రిల్	2273
మే	2206
జూన్	2474
జూలై	2513
ఆగస్ట్	2692

రక్త నమూనాల సేకరణ వద్ద రోగులు

పెరుగుతున్న డెంగీ, మలేరియా కేసులు

ఈ ఏడాది జిల్లాలో డెంగీ, మలేరియా కేసులు అధికంగా నమోదయ్యాయి జిల్లా కేంద్రాస్పత్రిలో మొత్తంగా 2లక్షల 62వేల 514 కేసులు నమోదు కాగా, వాటిలో డెంగీ కేసులు 920, మలేరియా కేసులు 3539 నమోదయ్యాయి. గత రెండు నెలల్లో అత్యధికంగా డెంగీ కేసులు జులైలో 163, ఆగస్టులో 164 నమోదు కావడంతో అందరిలోనూ ఆందోళన వ్యకమవుతోంది. మలేరియా కేసులు జులైలో 572, ఆగస్టులో 1207 కేసులు నమోదయ్యాయి.

పడిపోతున్న ప్లేట్‌లెట్స్

గతంలో డెంగీ జ్వరం సోకిన వారికి ఎక్కువగా ప్లేట్‌లెట్స్ తగ్గిపోయేవి. ప్రస్తుతం సాధారణ జ్వరం సోకిన వారికి కూడా ప్లేటులెట్లు గణనీయంగా తగ్గి పోతున్నాయి. కొంత మందికి 10వేలకు ప్లేట్‌లెట్లు పడిపోవడంతో ప్రాణ భయంతో రోగులు అల్లాడిపోతున్నారు. ఈ క్రమంలో ప్లేట్‌లెట్ల కోసం రోగులు ప్రైవేట్ బ్లడ్ బ్యాంకులను ఆశ్రయిస్తున్నారు ప్రభుత్వ బ్లడ్ బ్యాంకుల్లో రోగులకు పూర్తిస్థాయిలో ప్లేట్‌లెట్స్ అందించడం లేదు. దీంతో ప్రైవేట్ బ్లడ్ బ్యాంకులకు పరుగులు తీయాల్సిన పరిస్థితి దాపురిస్తున్నాయి.

వైద్య పరీక్షలకు క్యూ కడుతున్న జ్వర పీడితులు

జ్వరాలు రోజుల తరబడి తగ్గకపోవడంతో రోగులు వైద్య పరీక్షలు కోసం ల్యాబ్‌లకు క్యూ కడుతున్నారు ప్రభుత్వ ల్యాబెట్రీ లతో పాటు ప్రైవేట్ లాబరేటరీలకు వెళ్తున్నారు. ప్రభుత్వ మహారాజ ఆస్పత్రి లేబోరేటరీకి రోజుకు 50 నుంచి 100 మంది వరకు జ్వర పీడితులు వస్తున్నారు. నగరంలో 50 వరకు ప్రైవేట్ లేబోరేటరీలు ఉన్నాయి వీటికి రోజుకు 1500 నుంచి 2500 మంది వరకు జ్వర పీడితులు వైద్య పరీక్షలు కోసం వెళుతున్నట్లు లెక్కలు చెబుతున్నాయి.

దోచుకుంటున్న ప్రైవేట్ ఆసుపత్రులు

జ్వరాల బారిన పడిన రోగులు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్తే వారి జేబులను గుల్ల చేస్తున్నారు. అవసరం ఉన్నా లేకున్నా వైద్య పరీక్షలు చేస్తున్నారు. వైద్య పరీక్షలకు ఇన్ పేషెంట్ చికిత్సకు అధిక సంఖ్యలో ఫీజులు వసూలు చేస్తున్నారు. సాధారణ జ్వరానికి సైతం రూ.2వేలు నుంచి 3000 రూపాయలు ఖర్చు చేస్తున్నారు.

ఎయిర్‌పోర్టు పనులను పరిశీలిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

ఎయిర్‌పోర్టు పనులు 40 శాతం పూర్తి

- ప్రపంచంలోనే అత్యున్నత విమానాశ్రయంగా తీర్చిదిద్దుతాం
- కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి-భోగాపురం

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ పనులు శర వేగంగా జరుగుతున్నాయని కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు చెప్పారు. ఇప్పటికే 40 శాతం పనులు పూర్తయ్యాయని, విమానాశ్రయ నిర్మాణాన్ని ఆరు నెలల ముందే పూర్తి చేయడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. పనుల స్థితిగతుల గురించి అధికారులను, జిఎంఆర్ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. రన్ వే, టెర్మినల్ భవనం, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ సెంటర్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈసందర్భంగా కేంద్ర మంత్రి కింజరాపు విలేకరులతో మాట్లాడుతూ, 2026 జూన్ నాటికి భోగాపురం విమానాశ్రయాన్ని పూర్తిచేసి, ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఎయిర్‌పోర్టు నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు జిల్లా యంత్రాంగం, స్థానికులు నుంచి కూడా సంపూర్ణ సహకారం అందుతోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు స్ఫూర్తితో ప్రతినెలా విమానాశ్రయ నిర్మాణాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు. గత నెలలో పరిశీలించే సమయానికి సుమారు 36శాతం పనులు జరిగాయని, ప్రస్తుతం దాదాపు 40 శాతం వరకు పూర్తి కావస్తున్నాయని తెలిపారు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో, అత్యాధునిక నమూనాతో ఈ ఎయిర్‌పోర్టు నిర్మాణం జరుగుతోందన్నారు. భూములు ఇచ్చిన నిర్వాసితులకు అన్నివిధాలా న్యాయం చేసేందుకు తమ ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు. ఎయిర్‌పోర్టు పూర్తయితే ఉత్తరాంధ్ర ఎంతో అభివృద్ధి చెందుతుందని అన్నారు. దేశంలో పౌర విమానయాన రంగం శరవేగంగా అభివృద్ధి చెందుతుందనీ, పదేళ్ళ క్రితం 74 ఎయిర్‌పోర్టులుఉండగా, ప్రస్తుతం 157కు పెరిగాయని చెప్పారు. భవిషత్ లో వీటి సంఖ్య 400 కు చేరుతుందని తెలిపారు. విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి ఎంతగానో కృషి చేస్తున్నారని చెప్పారు. ప్రకృతి విపత్తులను కూడా మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన రెడ్డి బాధ్యతా రహితంగా, రాజకీయం చేస్తున్నారని అన్నారు. నష్టాన్ని అంచనా వేసిన వెంటనే, వరద బాధితులను ఆదుకునేందుకు కేంద్రం సిద్ధంగా ఉందని రామ్మోహన్ నాయుడు అన్నారు. ఈ పర్యటనలో ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవి, జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, ఎస్‌పి వకుల్ జిందాల్, జిఎంఆర్ సిఇఒ మనోమే రాయ్, సిడిఒ ఎం. కోటేశ్వరరావు, ఆర్‌డిఒ ఎంవి సూర్యకళ, తహాశీల్దార్ సురేష్, జిఎంఆర్, ఎల్ అండ్ టి ప్రతినిధులు పాల్గొన్నారు.

పొదుపు సొమ్ము స్వాహా

విఒఎ అక్రమాలకు పాల్పడిందని సభ్యుల ఫిర్యాదు

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

తాము నెల నెలా పొదుపు చేసుకొని దాచు కొన్న డబ్బులు విఒఎ స్వాహా చేసిందని అలజంగి గ్రామానికి చెందిన పొదుపు సంఘం సభ్యులు ఆరోపించారు. ఈమేరకు వారు శుక్రవారం విలేకర్లతో మాట్లాడారు. గ్రామానికి చెందిన విఒఎ పద్మ డ్వాక్రా మహిళల కళ్లు గప్పి సొమ్మును కాజేసి అక్రమాలకు పాల్పడుతుందని రామా, నూకాలమ్మ , ప్రశాంతి పొదుపుసంఘాల సభ్యులు తెలిపారు. గ్రామంలో 108 పొదుపుసంఘాలు ఉన్నాయని, ఒక్కో గ్రూపు బ్యాంకు ద్వారా బ్యాంక్ లింకేజీ రుణాలు తీసుకుని ఆ సొమ్ముతో చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటున్నాయని తెలిపారు. ఈ వ్యవహారాలు చూసేందుకు విఒఎగా శ్రీపతి పద్మ ఎలియాస్ సుజాత ను నియమించారని తెలిపారు. పొదుపు సంఘాలు బ్యాంకు ద్వారా తీసుకున్న రుణాలను తిరిగి వాయిదాల పద్ధతిలో చెల్లించడానికి విఒఎకు ఆ డబ్బులు ఇచ్చేవారమని, ఆమె ఆ సొమ్మును బ్యాంకుకు చెల్లించకుండా సొంత అవసరాలకు వాడుకుందని తెలిపారు. పొదుపుసంఘాల బ్యాంకు అకౌంట్ బుక్ లను ఆమె వద్ద ఉంచుకొని తిరిగి అడిగితే తమపై విరుచుకుపడేదని వాపోయారు. ప్రతీ నెలా క్రమం తప్పకుండా తీసుకున్న రుణాలకు వాయిదాల పద్ధతిలో తాము కట్టినా ఆమె బ్యాంకుకు చెల్లించకుండా తన సొంతానికి వాడుకుందని తెలిపారు. బ్యాంకు రుణాలు చేయాలంటే ఒక్కో గ్రూప్ దగ్గర నాలుగు వేలు నుండి ఐదు వేలు వరకు వసూలు చేస్తుందని తెలిపారు. విఒఎ చేస్తున్న అక్రమాలు నుండి కాపాడి తమ గ్రూపు సభ్యులు కట్టిన సొమ్మును రికవరీ చేసి న్యాయం చేయాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

అక్రమాలు జరిగాయని ఆరోపిస్తున్న పొదుపు సంఘ సభ్యులు

అప్ప డబ్బులు సక్రమంగా చెల్లించడంలేదు

మా పొదుపు సంఘం సభ్యులం బ్యాంకు నుండి లింకేజీ రుణం తీసుకున్నాం. ఈ అప్పును తీర్చేందుకు విఒఎ పద్మ కు నెలనెలా డబ్బులు చెల్లి స్తున్నప్పటికి ఆమె బ్యాంకుకు కట్టకుండా తన సొంత అవసరాలకు వాడుకుంది. దాదాపు రూ. లక్ష వరకు లెక్కల్లోతేడా వస్తుంది

- పొట్నూరు సత్యవతి, రామా పొదుపు సంఘం

అన్ని గ్రూపుల్లోనూ అక్రమాలు

గ్రామంలో 108 గ్రూపులు ఉన్నాయి. అన్ని గ్రూపుల్లోనూ అక్రమాలు జరిగాయి. సంబంధిత అధికారులకు ఇప్పటికే ఫిర్యాదు చేశాం. అన్ని సంఘాల వివరాలు తీసుకొని సమగ్ర దర్యాప్తు నిర్వహిస్తే అక్రమాలు బయట పడతాయి.

- భద్రమ్మ, సర్పంచ్ అలజంగి

బొబ్బిలిలో కుండపోత

లోతట్టు ప్రాంతాలు జలమయం

ప్రజాశక్తి-బొబ్బిలి

అల్పపీడన ప్రభావంతో పట్టణంలో శుక్రవారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. భారీ వర్షంతో రహదారులు జలమయమయ్యాయి. పట్టణంలో భారీ వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. గొల్లపల్లి దాడితల్లి కాలనీ, పాతబొబ్బిలి, ఇందిరమ్మ కాలనీలో నివాస ప్రాంతాల్లో వరదనీరు నిల్వ ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇందిరమ్మ కాలనీలో ఇళ్లలోకి వరదనీరు వెళ్లింది. వరదనీరు వెళ్లేందుకు కాలువలు లేకపోవడంతోనే ఇళ్లల్లోకి వరదనీరు వెళ్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షంతోపాటు గాలి వీయడంతో రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు కూలాయి. ఆ సమయంలో ప్రజలెవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.భారీ వర్షానికి జలమయమైన వివిధ ప్రాంతాలలో మున్సిపల్ కమిషనర్ ఎల్. రామలక్ష్మి పర్యటించారు. నిలిచిపోయిన నీటిని బయటకు తోడుటకు ఉన్న అవకాశాలను పరిశీలించారు. భైరవిసాగరం చెరువులో నీరు ఎక్కువగా చేరుతుండటంతో నీరు బయటకు పోవుటకు ఉన్న మార్గాలను పరిశీలించారు. టిబిఆర్ థియేటర్ రోడ్డు, జయప్రకాష్ స్కూల్ రోడ్డు, బైపాస్ రోడ్డు, పూల్‌బాగ్, టిటిడి కళ్యాణమండపం రోడ్డులో నిలిచిపోయిన నీటిని వ్యాక్యూమ్ ట్యాంకర్‌తో అత్యవసరంగా బయటకు తోడివేయించి ప్రజలకు ఇబ్బంది కలుగకుండా చూడాలని ఆదేశాలు జారీ చేశారు.

రోడ్డుపై నిలిచిపోయిన వర్షపునీరు

ఇంట్లోకి చేరిన నీరు

స్తంభించిన ట్రాఫిక్

పట్టణంలోని బజారు, శ్వేతాచలపతి స్కూల్ వద్ద ట్రాఫిక్ స్తంభించింది. ఒకపక్క వర్షం, మరోపక్క ట్రాఫిక్ స్తంభించడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వినాయక చవితి పూజ సామగ్రి కొనుగోలుకు పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో మార్కెట్‌కు రావడంతో 30నిమిషాల వరకు ట్రాఫిక్ స్తంభించింది.

పారాది వంతెన వద్ద వాహనాల బారులు

పారాది వంతెన వద్ద భారీగా ట్రాఫిక్ స్తంభించింది. శుక్రవారం సాయంత్రం వంతెన నుంచి గొర్లెసీతారాంపురం వరకు, మరోవైపు రామభద్రపురం వరకు ట్రాఫిక్ స్తంభించడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గంటన్నరకు పైగా ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు వంతెన వద్దకు చేరుకుని ట్రాఫిక్‌ను కంట్రోల్ చేశారు.

బొత్సకు ఘన స్వాగతం

ప్రజాశక్తి-గరివిడి

వైసిపి సీనియర్ నాయకులు, శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణకు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్సీగా, శాసనమండలి ప్రతిపక్ష నేతగా బొత్స ఎన్నికై తొలిసారి నియోజకవర్గానికి వచ్చిన నేపథ్యంలో అచ్యుతాపురం సాయిబాబా ఆలయం వద్ద వైసిపి నాయకులు ఘనంగా స్వాగతించారు. అక్కడి నుంచి గరివిడిలోని వైసిపి కార్యాలయం వరకు బైక్ ర్యాలీ చేపట్టారు. అనంతరం గరివిడి పార్టీ కార్యాలయంలో చీపురుపల్లి నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో బొత్స సమావేశం అయ్యారు. నియోజకవర్గ పరిస్థితులపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్, డిసిఎంఎస్ మాజీ చైర్మన్ శిరువూరు రమణరాజు, కెవి సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

బొత్సకు స్వాగతం పలుకుతున్న నాయకులు

గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్‌పి వకుల్ జిందాల్

తుపాను పట్ల అప్రమత్తం : ఎస్‌పి

ప్రజాశక్తి-భోగాపురం

తుపాను పట్ల మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌పి వకుల్ జిందాల్ సూచించారు. శుక్రవారం మండలంలోని చేపల కంచేరు, రెడ్డి కంచేరు, ముక్కాం గ్రామాలను సందర్శించారు. మత్స్యకారుల జీవన విధానం, సముద్రంలో చేపల వేటకు వెళ్లే సమయంలో ఏర్పడే ఇబ్బందులను మత్స్యకారులను అడిగి తెలుసుకున్నారు. వాతావరణ శాఖ తుఫాను హెచ్చరిక జారీ చేయడంతో మత్స్యకారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని, అనవసరంగా సముద్రంలోకి వెళ్లవద్దని కోరారు. మత్తు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, సైబరు మోసాలు పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎస్‌పి వెంట డిఎస్‌పి ఆర్.గోవిందరావు, భోగాపురం సిఐ ఎన్.వి.ప్రభాకరరావు, ఎస్‌బి సిఐ విజయనాథ్ ఉన్నారు.

పోలీసుల సంక్షేమానికి చర్యలు

విజయనగరం కోట : పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో వెల్ఫేర్‌డే నిర్వహించారు. పోలీసు సిబ్బంది ఒక్కొక్కరిని తన ఛాంబరులోకి పిలిచి, వారి వ్యక్తిగత, వృత్తిపరమైన, శాఖాపరమైన సమస్యలను తెలుసుకొని, వారి నుండి విజ్ఞాపనలు స్వీకరించారు. వాటి పూర్వాపరాలు పరిశీలించి, పరిష్కరించేందుకు చర్యలు చేపడతానని తెలిపారు.

జాతీయ తైక్వాండో పోటీలకు విజయనగరం క్రీడాకారులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 8 నుంచి 10 వరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఆగ్రాలో జరగబోయే జాతీయ సబ్ జూనియర్ , జూనియర్ తైక్వాండో పోటీలకు జిల్లా నుంచి ఏడుగురు క్రీడాకారులు పాల్గొంటున్నారు. రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలలో పి.పునీత్, వి.కుషాల్, ఎస్ సాత్విక్, కే.సాహిత్య, చరిత, భవిష్ , హర్షిని గోల్డ్ మెడల్ సాధించి జాతీయ పోటీలకు అర్హత సాధించారు. క్రీడాకారులను జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు గురాన అయ్యాలు, సిహెచ్ వేణుగోపాల్ రావు, సైక్లింగ్ అధ్యక్షులు ఎమ్.ఎస్.ఎన్ రాజు, సెపక్ తక్రా కార్యదర్శి రాజేష్, కోచ్ సిహెచ్ యశ్విని అభినందించారు.

భూమి అప్పగించాలని బాధితుల ధర్నా

ప్రజాశక్తి-జామి

మండలంలోని గొడుకొమ్ము రెవెన్యూలో సర్వేనెం, 49, 52లో నమ్మి అన్నపూర్ణ కుటుంబానికి సంబంధించిన భూమిని తమకు ఇప్పించాలని ఆమె కుటుంబ సభ్యులు శుక్రవారం తాహశీల్దార్ కార్యాలయం ధర్నా చేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ, అన్నపూర్ణ కుటుంబానికి చెందిన ఇతర వాటాదారుల వద్ద భూమి కొనుగోలు చేసిన ఓ స్థానిక వ్యక్తి తమ భూములను సైతం ఆక్రమించి సాగు చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై ఆర్‌డిఒ కోర్టులోనూ, జాయింట్ కలెక్టర్ కోర్టులోనూ వీరికి అనుకూలంగా తీర్పులు వచ్చినా... భూమి అప్పగించడం లేదన్నారు. కానీ భూమి మీదకు వస్తే సదరు ఆక్రమణ దారుదు దాడులు చేస్తున్నాడని తెలిపారు. రెవెన్యూ,పోలీసు అధికారులు చుట్టూ ఎన్ని సార్లు తిరిగినా ఉపయోగం లేకపోవడంతో ధర్నాకు దిగామని అన్నపూర్ణ, ఆమె, కుమార్తె తెలిపారు. తహశీల్దార్ కృష్ణలత, ఎస్ఐ వీరబాబు బాధితులతో మాట్లాడి, సర్వేనెం. 49లోని భూమిని రెవెన్యూ, పోలీసుల సమక్షంలో అప్పగిస్తామని, మిగిలిన భూమిపై కోర్టు తగాదా ఉన్నందున వరిష్కారం కాగానే తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

కిటకిటలాడిన మార్కెట్

వినాయక చవితి నేపథ్యంలో కొనుగోలుదారులతో విజయనగరం మార్కెట్ శుక్రవారం కిటకిటలాడింది. చవితి సామాగ్రి కొనుగోలు చేసేందుకు వచ్చిన జనాలతో ఎంజి రోడ్డు, మున్సిపల్ కార్యాలయం వద్ద మార్కెట్ కిక్కిరిసిపోయాయి. దీంతో పండ్లు, పూల ధరలు అమాంతంగా పెరిగిపోయాయి. ఎన్నడూ లేని విధంగా వినాయకుడ్ని పూజించే ఉసిరి, మామిడి, మారేడు తదితర పత్రిల విక్రయాలు జోరుగా సాగాయి. అరటి పళ్లు డజన్ 80 రూపాయల నుంచి వంద రూపాయలు వరకు విక్రయించారు. కొబ్బరిఇకాయ ఒక్కొక్కటి 40నుంచి 50 రూపాయల వరకు ధర పలికింది. ఒక్కొక్క యాపిల్, నారింజ 20 రూపాయలు పైనే ధర పలికింది. పూల ధరలు ఇక చెప్పనక్కర్లేదు. కేజీ రూ.400 వరకు విక్రయించారు.

- ప్రజాశక్తి, విజయనగరం కోట

కార్పొరేషన్ కార్యాలయం వద్ద కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న రోడ్డు

నులి పురుగుల నిర్మూలనకు

17న ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ

ప్రజాశక్తి-విజయనగరంకోట

జాతీయ నులి పురుగుల నిర్మూలనా కార్యక్రమం లో భాగంగా ఈ నెల 17 న అల్బెండజోల్ మాత్రలు ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. ఈ మాత్రలు 1 నుండి 19 ఏళ్ళ మధ్య ఉన్న పిల్లలందరికీ వేస్తామని తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో మాత్రల పంపిణీ పై సమావేశం నిర్వహించారు. పాఠశాలల్లో నమోదు కాని పిల్లలకు , కిషోర బాలలకు , అంగన్వాడీ పిల్లలకు, అన్ని పాఠశాలాల్లో , కళాశాలల్లో , వసతి గృహాల్లోని పిల్లలకు, వసతి గృహాల్లో వంట చేసే వారు కూడా ఈ మాత్రలు తప్పనిసరిగా వేయించాలని తెలిపారు. ఏ ఒక్కరైనా 17 న వేసుకొనక పోతే మళ్లీ 20వ తేదీన కూడా వేస్తారని తెలిపారు. ఈ మాత్రలు భోజనం చేసిన అర గంట తర్వాత వేసుకోవాలని తెలిపారు. ఈ మాత్రలు వేసుకొన్న తర్వాత కొంచం వికారం, వంతులు, నీరసం వంటివి వస్తే రావచ్చునని, అయితే కొద్దిసేపటికే తగ్గిపోతుందని, కంగారు పడవలసిన అవసరం లేదని తెలిపారు. మాత్రల వినియోగం పై విస్తృతంగా ప్రచారం గావించాలని, ఐసిడిఎస్, డిఇఒ, డిఆర్‌డిఎ ద్వారా గ్రామాల్లో విస్తతంగా ప్రచారం చేయించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా నులిపురుగుల నివారణ పై పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో డిఎంహెచ్ఒ డాక్టర్ భాస్కర రావు, జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అప్పల నాయుడు, రాష్ట్రీయ బాల స్వస్త్ కార్యక్రమం జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, డిపిఒ శ్రీధర్ రాజా, ఐసిడిఎస్ పీడీ శాంతకుమారి, డిఇఒ ప్రేమ కుమార్, ఆర్ఐఒ భీమ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అంబేద్కర్, అధికారులు

వాయు కాలుష్యాన్ని తగ్గిద్దాం

అసిస్టెంట్ కమిషనర్ తిరుమలరావు

ప్రజాశకి-విజయనగరం టౌన్

వాయు కాలుష్యాన్ని తగ్గించి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమలరావు, కాలుష్య నియంత్రణ మండలి ఇఇ సరిత పిలుపునిచ్చారు. శుక్రవారం అంతర్జాతీయ నీలి ఆకాశం కోసం స్వచ్ఛమైన గాలి దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. కోట వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీ మూడు లాంతర్లు, గంటస్తంభం, మీదుగా నగరపాలక సంస్థ కార్యాలయం వరకు సాగింది. ర్యాలీని జెండా ఊపి ప్రారంభించిన అనంతరం నగరపాలక సంస్థ ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం వాయు కాలుష్యం పెరగడంతో మానవాళి మనుగడ ప్రశ్నార్ధకమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వాయు కాలుష్యం వల్లనే అనేక రోగాలు, రగ్మతలకు కారణమవుతున్న విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలన్నారు కార్యక్రమంలో నగరపాలక సంస్థ సిబ్బంది, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

ర్యాలీని ప్రారంభిస్తున్న అసిస్టెంట్ కమిషనర్

పరిశుభ్రతతోనే వ్యాధుల నివారణ

ప్రజాశక్తి-బొబ్బిలి

పరిశుభ్రతతోనే వ్యాధుల నివారణ సాధ్యమని బాడంగి ఆయుర్వేద వైద్యులు ఎస్.ఉమాదేవి అన్నారు. పట్టణంలోని 16వ వార్డులో శుక్రవారం సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధుల నివారణకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. వర్షాలు ఎక్కువగా కురవడంతో డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాలు వచ్చే అవకాశం ఉందని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. నివాస ప్రాంతాల్లో చెత్త, మురుగునీరు లేకుండా చూడాలన్నారు. జ్వరాలతో బాధపడుతున్న వారిని పరీక్షించి మందులు పంపిణీ చేశారు.

దోమల నిర్మూలన అందరి బాధ్యత

ప్రజాశక్తి- శృంగవరపుకోట

దోమలను నిర్మూలించడం మన అందరి బాధ్యతని కొట్టం పిహెచ్‌సి డాక్టర్ జి.హరిక అన్నారు. పట్టణంలోని పెద్దవీధిలో శుక్రవారం డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత సీజన్లో వచ్చే జ్వరాలు ఎక్కువగా దోమల వల్ల వస్తాయని తెలిపారు. గృహల లోపల, బయట ప్రదేశాలలో పాడైపోయిన పాత్రలు గాని, వస్తువులు గాని ఉంటే వాటిలో నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. ఇంటి లోపల కుండీలలో నీటి నిల్వలను ఎక్కువ రోజులు ఉంచొద్దన్నారు. పెద్దవీధిలో వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో ఎస్ఐఒ బి.శ్రీనివాసరావు, హెల్త్ అసిస్టెంట్ శంకర్, రామకృష్ణ, ఎఎన్ఎం, ఎంటిపిఎస్ రాజశేఖర్, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రెస్టారెంట్ ప్రారంభం

ప్రజాశక్తి-కొత్తవలస

కొత్తవలస మండల కేంద్రంలోని తృప్తి పార్లర్ అండ్ రెస్టారెంట్‌ను ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, టిడిపి రాష్ట్ర నాయకులు కెబిఎ రాంప్రసాద్ దంపతులు శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు గొరపల్లి రాము, ప్రధాన కార్యదర్శి కనకాల శివ, పొట్నూరు రత్నాజీ, మాజీ జెడ్‌పిటిసి కోళ్ల శ్రీను, ఉపాధ్యక్షులు ఎల్లపు సూరిబాబు, తెలుగు యువత నాయకులు కొరుబిల్లి ఉపేంద్ర, గొంప దుర్గామహేష్ పాల్గొన్నారు.

వినాయక మండపాలకు అనుమతులు తప్పనిసరి

ప్రజాశక్తి-డెంకాడ

మండలంలో వినాయక మండపాలను ఏర్పాటు చేస్తున్న వారు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని ఎస్ఐ సన్యాసినాయుడు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సింగిల్ విండో సిస్టం ద్వారా స్థానిక పోలీస్ స్టేషనుకు సమాచారం తెలియజేయాలన్నారు. చిన్న, పెద్ద అన్ని విగ్రహాలకు అనుమతులు తీసుకోవాలన్నారు. లేకుంటే కమిటీపై కేసు నమోదు చేస్తామన్నారు.

గుంపాంలో అక్షరాస్యత వారోత్సవాలు

ప్రజాశక్తి-పూసపాటిరేగ

మండలంలోని గుంపాం గ్రామంలో అంతర్జాతీయ అక్షరాస్యత వారోత్సవాలను శుక్రవారం నిర్వహించారు. మహిళలకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. సర్పంచ్ ఆదిలక్ష్మి, గ్రామ పెద్దలు కొత్తకోట వెంకటరమణ, ఎర్ర రామకృష్ణ బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంపై వయోజనులకు అవగాహన కల్పించి వారిలో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వయోజన విద్యాశాఖ సిబ్బంది అల్లు సోమేశ్వరరావు, ధనలక్ష్మి, రాజేశ్వరి, జయరాం, లింగాల ఈశ్వరరావు పాల్గొన్నారు.

గురజాడ విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి-విజయనగరం

ఎల్ఐసి 68వ వీక్ సెలెబ్రేషన్స్ సందర్భంగా ఈనెల 1 నుంచి 7వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. 8, 9, 10 తరగతుల విద్యార్థులకు జిల్లా స్థాయి వ్యాసరచన పోటీల్లో గురజాడ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని కె. లక్ష్మి శ్రీ వాణి ప్రథమ బహుమతి సాధించింది. జిల్లా స్థాయి పోటీలో ప్రథమ స్థానం పొందిన లక్ష్మి శ్రీ వాణిని పాఠశాల డైరెక్టర్ ఎంవిఆర్ కృష్ణాజీ, కరస్పాండెంట్ ఎం. స్వరూప, హెచ్ఎం పూడి శేఖర్ అభినందించారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి-వేపాడ

విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు ఈశ్వరరావు

వేపాడలోని విక్టరీ హైస్కూల్లో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. సుమారు 200 మందికి పిహెచ్‌సి వైద్యులు ఎ.ధరణి ఆధ్వర్యాన పరీక్షలు చేసి, మందులు అందించారు. కార్యక్రమంలో కంటి వైద్య నిపుణులు సిహెచ్ ఈశ్వరరావు, సిహెచ్.ఒ ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

లెండిలో ఫ్రెషర్స్‌డే వేడుకలు

ప్రజాశక్తి-డెంకాడ

నృత్యం చేస్తున్న విద్యార్థులు

మండలంలోని జొన్నాడ వద్దనున్న లెండి ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంస్థ వైస్ చైర్మన్ పి.శ్రీనివాసరావు, సెక్రటరీ కె.శివ రామకృష్ణ మాట్లాడుతూ మంచి అభిరుచితో ఇంజినీరింగ్ విద్యాభ్యాసం కానిస్తే మాంద్యం వచ్చినా అవకాశాలను అంది పుచ్చుకునేలా నైపుణ్యాలను పొందవచ్చన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఉర్రూతలూగించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపల్ వివి రామరెడ్డి, వైస్ ప్రిన్సిపల్స్ హరిబాబు తమ్మినేని, కె.వి.నరసింహం, ప్లేస్‌మెంట్ డీన్ ప్రకాశబాబు, విభాగాధిపతులు రామారావు, సుబ్బరామయ్య, రాజేంద్ర, ఎం.రాజంబాబు, వి.ప్రసాద్, సతీష్, పీడీ శైలజ పాల్గొన్నారు.

మట్టి ప్రతిమలు పంపిణీ

విజయనగరంలో మట్టి ప్రతిమలను పంపిణీ చేస్తున్న కలెక్టర్

నెల్లిమర్ల.. మట్టి విగ్రహాల పంపిణీలో పాల్గొన్న ఎంపి కలిశెట్టి

బొబ్బిలి.. వినాయక విగ్రహాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

వినాయక చవితి సందర్భంగా పలు స్వచ్ఛంద సంస్థలు, సామాజిక కార్యకర్తల ఆధ్వర్యాన మట్టిన వినాయక ప్రతిమలను జిల్లా వ్యాప్తంగా శుక్రవారం పంపిణీ చేశారు.

శృంగవరపుకోట.. మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తున్న రఘురాజు

భోగాపురం.. మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మాధవి

విజయనగరంటౌన్.. మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు శ్రీను

నైతిక విలువలు నేర్పించండి

ఎస్‌టి కమిషన్ చైర్మన్ డివిజి శంకరరావు

ప్రజాశక్తి-గజపతినగరం

ఉపాధ్యాయులు విద్యార్థులకు నైతిక విలువలు, మానవ సంబంధాలు నేర్పించాలని ఎస్‌టి కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకర్రావు సూచించారు. గురుపూజోత్సవం సందర్భంగా చైతన్య భారతి -లయన్స్ క్లబ్ సంయుక్తంగా ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులను ప్రదానం చేశాయి. ఈ సందర్భంగా శంకర్రావు మాట్లాడుతూ విద్యార్థులలో నిబిడీకృతమై ఉన్న విలువలను బయటకు తీయాలన్నారు.

విజయనగరం మండలం కోరాడపేట ఎంపిపి స్కూలు ప్రధానోపాధ్యాయులు చుక్కల పైడితల్లి జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికై జిల్లా కలెక్టర్, డిఇఒ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.
- ప్రజాశక్తి, విజయనగరం కోట

బొబ్బిలి, గజపతినగరంలో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న రోటరీ, లయన్స్ క్లబ్ సభ్యులు

తాడేపల్లిగూడెం డిగ్రీ కళాశాల లెక్చరర్ డాక్టర్ సుంకర గోపాలయ్య, లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ బెల్లాన లక్ష్మీనరేన్, చైతన్య భారతి గౌరవ అధ్యక్షులు డాక్టర్ వి.కృష్ణారావు, పూర్వ అధ్యక్షులు డాక్టర్ ఎ.ఎల్ నాయుడు, గంట్రెటి లక్ష్మణరావు, గంట్రెటి అప్పలనాయుడు మాట్లాడారు. చైతన్యభారతి ప్రధానకార్యదర్శి బొంతలకోటి శంకరరావు, కార్యవర్గ సభ్యులు బెహరా నాగభూషణరావు, పొట్నా రమణారావు, పాయల. మురళీకృష్ణ, ఎం.పద్మావతి, లయన్స్ ప్రిన్సిపల్ బొంతలకోటి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం కోట : ఉత్తమ పౌర సమాజాన్ని స్థాపించగలిగే శక్తి ఉపాధ్యాయులకే ఉందని ఈవినింగ్ వాకర్స్ క్లబ్ అధ్యక్షులు జామి అప్పలసూరి, కార్యదర్శి టి.చిన్నారావు అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకష్ణన్ 136వ జయంతి సందర్భంగా గురువారం రాత్రి ఉడా కాలనీ ఈవినింగ్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అనంతరం విశ్రాంత ఉపాధ్యాయుడు బగ్గం వెంకట్రావుతోపాటు మరో 11మంది ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఈవినింగ్ వాకర్స్ క్లబ్ పూర్వ అధ్యక్షుడు ఎస్.గౌరీ ప్రసాద్, సలహాదారు టి.చిరంజీవి రావు, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి : ఉపాధ్యాయులు సమాజ నిర్మాతలని ఎంపిడిఒ రవికుమార్ అన్నారు. శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవం నేపథ్యంలో ఉపాధ్యాయులుగా పనిచేస్తూ రోటరీ ద్వారా సమాజానికి సేవలందిస్తున్న ఉపాధ్యాయ రొటేరియన్స్‌ను సత్కరించే కార్యక్రమాన్ని ఎన్ఆర్ఐ హాస్పిటల్ సమావేశ హాల్‌లో క్లబ్ అధ్యక్షులు శ్రీనివాసన్, కార్యదర్శి ప్రవీణ్ కుమార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ ఎంపిడిఒ కిరణ్ కుమార్, డాక్టర్ రామ్‌కుమార్.. రోటరీ ద్వారా సేవలందిస్తున్న డిస్ట్రిక్ట్ చైర్ జెసి రాజు, డాక్టర్ సజ్జ అప్పలరాజు, ప్రవీణ్ కుమార్, శ్రీదేవి, కృష్ణమోహన్, ఐఇఆర్‌టి శివ కాంత్‌ను సత్కరించారు. అంతర్జాతీయ రోటరీ సంస్థ జారీచేసిన ప్రశంసా పత్రాలను అందించారు. ప్రెసిడెంట్ ఎలెక్ట్ శ్రీహరి, రోటరీ కార్యనిర్వహణ కార్యదర్శి కె.రామకృష్ణ, రోటరీ సభ్యులు, ఉపాధ్యాయులు, హాస్పిటల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కె.వి.జోగారావును ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు శుక్రవారం పట్టణంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బ్రాంచ్ చైర్మన్ డాక్టర్ పి వరలక్ష్మి, జిల్లా ఎంసి మెంబర్ దొడ్డి సూర్యారావు, బ్రాంచ్ వైస్ చైర్మన్ ఎ.మల్లేశ్వరరావు, కోశాధికారి శ్రీనాథ్ వెంకన్న బాబు, కార్యదర్శి జి.ధనుంజయ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు గణపతిరావు తదితరులుపాల్గొన్నారు.

ప్లాస్టిక్‌పై ప్రజారోగ్య శాఖ దాడులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దే క్రమంలో శుక్రవారం నగరంలో పలు ప్లాస్టిక్ దుకాణాలలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి నేతృత్వంలో సిబ్బంది దాడులు నిర్వహించారు. మొత్తం మూడు షాపులలో తనిఖీలు నిర్వహించి 48 కేజీల ప్లాస్టిక్ వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు విక్రయ దుకాణాలపై దాడులు నిర్వహించామన్నారు. పలు దుకాణాలలో విక్రయిస్తున్న నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను స్వాధీనం చేస్తున్నామని, మళ్లీ ఇటువంటి అమ్మకాలు పునరావృతం అయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

వాసవీ క్లబ్ వారోత్సవాలు ప్రారంభం

ఈనెల 1 నుంచి 7 వ తేదీ వరకు వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ గవర్నర్ ఆత్మకూరి సాంబమూర్తి తెలిపారు. శుక్రవారం ఆర్యవైశ్య వెల్ఫేయిర్ అసోసియేషన్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజులపాటు సమాజ సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. మొక్కలు నాటడం, రక్తదానం, ప్రకృతి పరిరక్షణ అంశాలపై విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ జిల్లా కార్యదర్శి గుంపిన నారాయణరావు, వైస్ గవర్నర్ ఆలవెల్లి శేఖర్, క్లబ్ అధ్యక్షుడు చెన్నా బుచ్చి జనార్దనరావు, కార్యదర్శి కట్టమూరి రత్నారావు, కోశాధికారి విజ్జపు విజయకుమార్, రీజియన్ సెక్రెటరీ సముద్రాల నాగరాజు, వాసవీ క్లబ్ వనిత విజయం అధ్యక్షురాలు పలుకూరి ప్రభావతి,కార్యదర్శి కాపుగంటి రాధిక, కోశాధికారి గుంపిన దేవి విద్యాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న గణిత గణపతులు

గజపతినగరం : జిన్నాం గ్రామంలో ఉన్నత పాఠశాల విద్యార్థులు శుక్రవారం ప్రధానోపాధ్యాయులు ఎస్.త్రినాథరావు ఆధ్వర్యంలో జ్యామితీయ ఆకారాలలో వృత్త, త్రిభుజ, చతుర్భుజ, గణిత, ట్రాఫిక్ సిగ్నల్ గణపతులను, మట్టి వినాయక ప్రతిమతలను ఎంతో అందంగా తయారు చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ఈ విధంగా చేయడం వల్ల విద్యార్థులు గణితం పట్ల భయం వదిలి అవగాహన, ఆసక్తి పెరుగుతుందని, సులభంగా అర్థమవుతుందని తెలిపారు. మట్టి గణపతులను వాడడం వల్ల పర్యావరణానికి మంచి చేసిన వారవుతామని చెప్పారు.

గిరిజనుల సమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

మోసూరువలస గిరిజనుల సమస్యను తహశీల్దార్ ఎం.శ్రీను పరిష్కరించారు. గ్రామంలో ప్రభుత్వ ఇళ్ల నిర్మాణం కోసం పొజిషన్ ధృవీకరణ కోసం ఎస్‌టి కమిషన్ చైర్మన్‌కు ఆ గ్రామస్తులు ఫిర్యాదుచేశారు. దీంతో శుక్రవారం తహశీల్దార్ ఎం.శ్రీను, ఆర్ఐ కళ్యాణ్ చక్రవర్తి, సర్వేయర్లు ఆ గ్రామానికి వెళ్లారు. గ్రామంలో సమస్యపై విచారణ చేసి గృహనిర్మాణ శాఖ అధికారులతో సమీక్షించారు. సమస్య పరిష్కారం కోసం నివేదిక తయారు చేసి ఎస్‌టి కమిషన్ చైర్మన్‌కు పంపించినట్లు తహశీల్దార్ తెలిపారు. సమస్య పరిష్కరించిన తహశీల్దార్ శ్రీనుకు గిరిజనులు కృతజ్ఞతలు తెలిపారు.

అంగన్వాడీ కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి-తెర్లాం

మండలంలోని ఉద్దవోలు సచివాలయ పరిధిలోని యు.గదబవలస గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని శుక్రవారం ఐసిడిఎస్ పిఒ కె.రాజ్యలక్ష్మి పరిశీలించారు. ఆ గ్రామంలో జన్‌మన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రానికి భవనం లేకపోవడంతో అద్దె ఇంటిలో నిర్వహిస్తున్నారు. భవనం మంజూరు చేయాలని గ్రామస్తులు సిడిపిఒను కోరారు. ప్రాథమిక పాఠశాల కూడా శిథిలావస్థలో ఉందని వివరించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ వెంకటలక్ష్మి, సర్పంచ్ సునీత, ఉపసర్పంచ్, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

బురదలో కూరుకుపోయిన కారు

ప్రజాశక్తి-భోగాపురం

బురదలో కూరుకుపోయిన కారును ట్రాక్టర్‌తో బయటకు తీస్తున్న యజమాని

మండలంలోని జమ్మయ్యపేట వెళ్లే రహదారిలో శుక్రవారం బురదలో ఒక కారు కూరుకుపోయింది. దీంతో అటు, ఇటు వెళ్లేందుకు వీలుకాలేదు. చివరికి ట్రాక్టర్‌కు కట్టి బయటకు తీయాల్సిన పరిస్థితి ఏర్పడింది. విమానాశ్రయ నిర్మాణంలో తారురోడ్డును తొలగించి ప్రహరీ చుట్టూ మట్టి రోడ్డు వేశారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు విమానాశ్రయం లోపల నుంచి వరద నీరు ఈ రహదారి పైనుంచి వెళ్తోంది. దీంతో సుమారు నాలుగైదు గ్రామాల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల మరడపాలెం గ్రామానికి చెందిన టిడిపి నాయకులు కోరాడ తాతారావు ఈ రహదారిని బాగు చేయాలని తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. కానీ విమానాశ్రయ నిర్మాణ సంస్థ కనీసం పట్టించుకోకపోవడం విశేషం. త్వరలో ఈ గ్రామాలకు చెందిన ప్రజలు విమానాశ్రయ సంస్థ ప్రధాన గేటు వద్ద ధర్నా చేసేందుకు సిద్ధమవుతున్నారు.

ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు అవగాహన సదస్సు

ప్రజాశక్తి-విజయనగరం

మాట్లాడుతున్న జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గోవిందరావు

గత ఐదు రోజులుగా కంటోన్మెంట్‌లోని జన శిక్షణ సంస్థాన్ ఒకేషనల్ ట్రైనింగ్ సెంటర్‌లో జరుగుతున్న ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల అవగాహన సదస్సు శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎన్.గోవిందరావు మాట్లాడారు. ఒక వ్యాపారాన్ని ఎలా ఎంచుకోవాలి, ఎలా ప్రారంభించాలి, ఎలా అభివృద్ధి చేసుకోవాలో అవగాహన కల్పించారు. ఈ సదస్సులో జిల్లా పరిశ్రమలశాఖాధికారి టి.వంశీమోహన్, ఐఎల్ఒ ట్రైనర్స్ ఎన్.జోత్స్న, ప్రముఖ వ్యాపార వేత్త ఎల్‌వి రామ్‌పూరినాయుడు, జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ వి.హరీష్, కెనరా బ్యాంకు మేనేజర్ పి.ప్రభాకర్ పాల్గొన్నారు.

సత్య కళాశాలలో సెమినార్

ప్రజాశక్తి-విజయనగరం

సత్య డిగ్రీ, పీజీ కళాశాల తృతీయ సంవత్సరం విద్యార్థులకు శుక్రవారం కెరీర్స్ ఇన్ ఎమర్జింగ్ టెక్నాలజీస్ పై సెమినార్‌ను ఇన్విక్టా కెరీర్ కన్సల్టెన్సీ ప్రైవేటు లిమిటెడ్ డైరెక్టర్ సౌమ్యదీప్ చక్రవర్తితో నిర్వహించారు. క్రొత్తగా వస్తున్న టెక్నాలజీలు అయిన ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్, డేటా సైన్సు 6జి లాంటి కమ్యూనికేషన్ వంటి అభివృద్ధి చెందుతున్న రంగాలలో విద్యార్థులు కెరీర్ మార్గాలను ఎలా రూపొందించుకోవాలో ఆయన వివరించారు. ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్, 6జి వంటి సాంకేతిక లలో ఉద్యోగ అవకాశాలను తెలిపారు. విద్యార్థులు తమ సామర్థ్యాలను ఎలా అభివృద్ధి చేసుకోవాలో తెలిపారు. గ్లోబల్ టెక్నాలజీ మార్కెట్ లో పోటీ తత్వం పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులు అనుకూలంగా మారటానికి అవసరమైన నైపుణ్యాలను మౌలికంగా అభివృద్ధి చేసుకోవాలని అన్నారు. ఈ సెమినార్ విద్యార్థులకు భవిష్యత్తు లో వున్న అవకాశాలను అవగాహన చేసుకోవడానికి ఉపయోగపడుతుందని కళాశాల సంచాలకులు డాక్టర్ ఎం.శశి భూషణరావు అన్నారు. కార్ర్యమంలో ఇన్విక్టా మరో డైరెక్టర్ కృష్ణ మోహన్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవి సాయి దేవ మణి, విద్యార్థులు పాల్గొన్నారు.

విజయమోహన్‌రావుకు జాతీయ అవార్డు

ప్రజాశక్తి-బొబ్బిలి

పాత బొబ్బిలికి చెందిన ఉపాధ్యాయులు ఎం.విజయ మోహన్ రావు అంతర్జాతీయ ఆంగ్ల భాషోపాధ్యాయుల సంఘం అవార్డు అందుకున్నారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆ సంస్థ జాతీయ స్థాయిలో ఇంగ్లీష్ టీచర్లు నుండి దరఖాస్తులు ఆహ్వానించింది. విజయ మోహన్‌రావు విద్యార్థుల ఆంగ్ల భాషా అభ్యసన అభివృద్ధికి చేస్తున్న అంశాలను గుర్తించి గత ఆదివారం ఆన్‌లైన్‌లో ఇంటర్వ్యూ నిర్వహించింది. దేశ వ్యాప్తంగా 20 మంది టీచర్లను ఎంపిక చేసింది. అందులో జాతీయ స్థాయి ఆంగ్ల భాషా ఉత్తమ ఉపాధ్యాయులుగా విజయ మోహన్ రావుకు ప్రశంసాపత్రం, మెమోంటో లభించాయి. దీంతో ఆయనను పలు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు అభినందించారు.

నగదు చోరీ కేసులో దొంగ అరెస్టు

ప్రజాశక్తి-విజయనగరం కోట

నగరంలోని రైల్వేస్టేషన్ నుంచి బస్టాండ్‌కు నడుచుకొని వెళ్తున్న ఓ మహిళ వద్ద నగదుతో ఉన్న పర్సు లాక్కొని పరారైన దొంగను వన్‌టౌన్ పోలీసులు పట్టుకున్నారు. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట మండలం ఉర్లాం గ్రామానికి చెందిన పి.సంతోషికుమారి ఆనందపురం వద్ద కెకెఆర్ గౌతమ్ స్కూలులో చదువుతున్న తన కుమారుడి వద్దకు వెళ్లేందుకు శుక్రవారం ఉ ఉదయం రైలులో నరసన్నపేట నుంచి విజయనగరం వచ్చింది. ఇక్కడి నుంచి బస్సుపై ఆనందపురం వెళ్లేందుకు రైల్వేస్టేషన్ నుంచి బస్టాండ్‌కు నడుచుకుంటూ వెళ్తుండగా, ముగ్గురు వ్యక్తులు ఆమెను అడ్డగించి భయపెట్టి తన వద్దనున్న పర్సు లాక్కొని పరారయ్యారు. ఆ పర్సులో మొబైల్‌తో పాటు రూ.10వేలునగదు ఉంది. వెంటనే ఆమె వన్‌టౌన్‌పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు అప్రమత్తమై ఆ దొంగను పట్టుకున్నారు. నిందితుడు పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడుకు చెందిన చింతా ఆనంద్(28)గా గుర్తించారు. అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

FACOR ALLOYS LIMITED
CIN L27101AP2004PLC043252
Regd. Office : Shreeramnagar-535101, Dist. Vizianagaram (A.P.)
PHONE : +91 8952 282029, 282038 FAX : +91 8952 282188; Email: facoralloys@falgroup.in
Corp. Office: Polyplex Building, Tower-B, Ground Floor, B-37, Sector-1, Noida - 201031
Phone: +91-120 - 4206442 ; Email: corpoffice@falgroup.in; Website: www.facoralloys.in

NOTICE OF 21ST ANNUAL GENERAL MEETING, REMOTE E-VOTING & BOOK CLOSURE INFORMATION

NOTICE is hereby given that the 21st Annual General Meeting ('AGM') of the Members of Facor Alloys Limited (the 'Company') will be held on Monday, the 30th day of September, 2024 at 12:00 p.m. (IST) through Video Conferencing ('VC') / Other Audio-Visual Means ('OAVM') to transact the businesses as set out in the Notice of AGM. In accordance with the General Circulars issued by the Ministry of Corporate Affairs dated April 8, 2020, April 13, 2020, May 5, 2020, January 13, 2021, December 14, 2021, May 05, 2022 & September 25, 2023 (collectively called 'MCA Circulars'), the Company has completed the dispatch of Notice for the 21st AGM along with a link therein to download the Annual Report for Financial Year 2023-24, on 6th September, 2024 through only email/ electronically to those Members whose e-mail addresses are registered with the Company/Registrars and Transfer Agent ('RTA')/Depositories. The physical copies of the Annual Report has not been dispatched in compliance with the aforesaid MCA Circulars read with SEBI Circular dated May 13, 2022. The copy of the Notice of AGM being the part of the Annual Report, is available on the website of the Company www.facoralloys.in as well as of the BSE Limited ('BSE') at www.bseindia.com for download. The detailed instructions for attending the ensuing AGM through 'VC/OAVM', are given in the Notice of AGM.

Further, the full Annual Report for the Financial Year 2023-24 which itself containing the Notice of 21st AGM, can be downloaded from the following link: **https://www.facoralloys.in/assets/pdf/Annual%20Report_2024%20(Facor).pdf**

Information regarding Remote E-Voting:

In compliance with Section 108 of the Companies Act, 2013 ('Act') read with Rule 20 of the Companies (Management and Administration) Rules, 2014, Regulation 44 of the SEBI (LODR) Regulations, 2015 and the Secretarial Standard on General Meetings ('SS-2') issued by the Institute of Company Secretaries of India, as amended upto date, the Company is providing to its Members, the facility of "remote e-voting" before the AGM as well as "e-voting during the AGM", in respect of the businesses to be transacted at the ensuing AGM. For the purpose, the Company is availing the services of National Securities Depositories Limited (NSDL) to conduct the voting process in a fair and transparent manner. The detailed instructions for remote e-voting are given in the Notice of AGM. Members are requested to note the following:

The remote e-voting facility would be available during the following period:

Commencement of remote e-voting	From 09:00 am. (IST) on Friday, September 27, 2024
End of remote e-voting	At 5:00 p.m. (IST) on Sunday, September 29, 2024

The remote e-voting module will be disabled by NSDL thereafter and Members will not be allowed to vote electronically beyond the said date and time.

The voting rights of the Members shall be in proportion to their share of the paid-up equity share capital of the Company as on Monday, September 23, 2024 ('Cut-Off Date').

Any person who acquires shares and becomes a Member of the Company after the electronically dispatch of the Notice of AGM and holds shares as of the cut-off date i.e. Monday, September 23, 2024, may obtain the login ID and password for remote e-voting by sending a request to NSDL at evoting@nsdl.co.in or can use their existing credentials if already registered with NSDL.

Mr. Tumul Maheshwari, a Practising Company Secretary has been appointed as the Scrutinizer to scrutinize the process of "remote e-voting" as well as "e-voting during the AGM" in a fair and transparent manner.

The voting results shall be declared within the stipulated time period as specified by law. The results declared along with Scrutinizer's Report will be placed on the Company's website www.facoralloys.in as well as will also be informed and available on the website of BSE at www.bseindia.com.

Book Closure Information:

Members are requested to note that the Register of Members and the Share Transfer Books of the Company will remain closed from Thursday, September 26, 2024 to Monday, September 30, 2024 (both days inclusive) for the purpose of convening of ensuing AGM of the Company.

By Order of the Board
For Facor Alloys Ltd.
Sachin Kumar Gupta
Company Secretary and Compliance Officer

Date : 6th September 2024
Place : Noida

నేరాలు ఘోరాలు

పోక్సో కేసులో నిందితుడికి 20ఏళ్ల జైలు

శృంగవరపుకోట : ఎనిమిదేళ్ల బాలికపై అత్యాచార ఘటనలో నిందితునికి జిల్లా కోర్టు 20 ఏళ్లు జైలు శిక్ష, రూ.11,500 జరిమానా విధించినట్లు సిఐ బిఎన్ మూర్తి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2018 సంవత్సరంలో బొడ్డవర ఎంపి యుపి పాఠశాలలో చదువుతున్న బాలిక పాఠశాల విడిచిన తరువాత గ్రామానికి వెళ్తుండగా గంట్యాడ మండలం పెంట శ్రీరాంపురం గ్రామానికి చెందిన గంధవరపు గోపి ఆ బాలికను మోటార్ వాహనంపై ఎక్కించుకొని నవోదయ కేంద్రీయ విద్యాలయ పరిసరాలలో అత్యాచారం చేశాడు. అప్పటి ఎస్ఐ అమ్మి నాయుడు నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. నేరం రుజువు కావడంతో జిల్లా కోర్టు నిందితుడికి శిక్షణ విధించిందని సిఐ తెలిపారు.

గల్లంతైన యువకుడు మృత్యువాత

జామి : మండల కేంద్రంలోని జామి దళిత కాలనీకి చెందిన బోని అజయ్ (24) గోస్తనీ నదిలో మునిగి మృతి చెందిన ఘటన కలకలం రేపింది. పోలీసులు వివరాలు ప్రకారం... బోని అజయ్ విశాఖ పోర్టులో లారీ డ్రైవర్ గా పని చేస్తున్నాడు. ఈనెల 4న పుట్టిన రోజు వేడుకలు చేసుకుని, నదిలో చేపల కోసం దిగినట్లు స్థానికులు చెబుతున్నారు. అప్పటినుంచి అజయ్ కనిపించక పోవడంతో గురువారం సాయంత్రం పోలీసులకు తల్లిదండ్రులు ఈశ్వరావు, పార్వతులు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు విచారించగా, సోమయాజపాలెం వద్ద నదిలో అజయ్ మృతదేహం లభ్యమైంది. ఎస్ఐ వీరబాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మడ్డువలస కాలువలో పడి యువకుడు మృతి

ప్రజాశక్తి-రేగిడి

మడ్డువలస ప్రధాన కాలువలో ప్రమాదవశాత్తూ జారిపడి ఓ యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన అంబాడ గ్రామం వద్ద చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అంబాడ గ్రామ సమీపంలో మడ్డువలస ప్రధాన కాలువ వద్దకు గురువారం సాయంత్రం తూలుగు వెంకటేశ్వరరావు(21) బహిర్భూమికి వెళ్లాడు. ప్రమాదవశాత్తూ కాలుజారిపడి కాలువలో మునిగిపోయాడు. పొలం పనులకు వెళ్లిన వారు చూసి విషయాన్ని గ్రామస్తులకు తెలిపారు. దీంతో కాలువలో గాలింపు చర్యలు చేపట్టారు. వెంకటేశ్వరరావు అపస్మారక స్థితిలో ఉండడంతో రాజాం కేర్ ఆసుపత్రికి తరలించారు. ఆస్పత్రిలో వైద్యులు పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అనంతరం వెంకటేశ్వరరావు మతదేహాన్ని రాజాం ఏరియా ఆసుపత్రికి తరలించారు. శుక్రవారం ఉదయం వెంకటేశ్వరరావు తండ్రి సింహాచలం రేగిడి పోలీసులకు సమాచారం అందించారు. ఎఎస్ఐ రాజారావు పంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం అనంతరం బంధువులకు మృతదేహాన్ని అప్పగించారు.. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ తెలిపారు.

వెంకటేశ్వరరావు(ఫైల్)

ప్రయివేట్ కంపెనీలో పనిచేస్తూ

వెంకటేశ్వరరావు డిగ్రీ వరకు చదివాడు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో వాలంటీర్‌గా పని చేస్తూ, ఖాళీ సమయంలో గ్రామాల్లో ఇనుప ముక్కలు కొనుగోలు చేసి కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఆయనకు తండ్రి సింహాచలం, తల్లి లక్ష్మి ఉన్నారు. వీరు వృద్ధులు. గణేష్, చంద్రశేఖర్ అనే ఇద్దరు అన్నదమ్ములు ఉన్నారు. వీరు పనులు చేసుకుంటూ జీవనం గడుపుతున్నారు. ప్రభుత్వ్ర తరపున ఈ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని సర్పంచ్ చుక్క వెంకటి నాయుడు కోరారు.

తెగిపడిన విద్యుత్తు తీగలు

రెండు ఆవులు మృతి

ప్రజాశక్తి-తెర్లాం

మండలంలోని ఎంఆర్ అగ్రహారం గ్రామంలో విద్యుత్తు తీగలు పడి చెట్ల తవుడుకు చెందిన రెండు ఆవులు మరణించాయి. జీవనాధారమైన ఆవులు మృతి చెందడం పట్ల కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదనకు లోనయ్యారు ఈ విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ ప్రతినిధి వెంకట్రావు, పంచాయతీ కార్యదర్శి, పశుసంవర్ధక శాఖ సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు.

ఇంటి పైనుంచి పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-డెంకాడ

మండలంలోని బొడ్డవలస పంచాయతీ పరిధిలో గెద్దవానిపాలెంలో ఇంటిపైనుండి పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం జరిగింది. ఎస్ఐ సన్యాసినాయుడు కథనం ప్రకారం.. సిడగం లక్ష్మీనారాయణ (36) గ్రామంలో ఇల్లు నిర్మించుకుంటున్నాడు. శుక్రవారం ఉదయం గోడ పైకి ఎక్కి పైపుతో వాటరింగ్ చేస్తుండగా కాలుజారి కింద పడిపోయాడు. దీంతో ఆయన తలకు, కాలికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు విజయనగరం ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షలు నిర్వహించి, అప్పటికే మరణించినట్లు తెలిపారు. లక్ష్మీనారాయణ తమ్ముడు సిడగం శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT: VIZIANAGARAM
O.S.24/2024

Between:
Sri T. Ravi Varma & others ...Plaintiffs
And:
Sri K. Murali Krishna &14 others ...Defendants

SUMMONS

To,
Defendant No.7:
Alaboina Thammayya,
S/o. Ramayya,
R/o. Bhulokapathi Varakattu Village,
Cheepurupalli Mandalam,
Vizianagaram District.
Defendant No.10:
Sagiraju Bala Venkatapathi Varma,
S/o. Suryanarayana Raju,
aged about 60 years,
R/o.Bhulokapathi Varakattu (Alakanarayana Puram) Village,
Cheepurupalli Mandalam,
Vizianagaram District.

Please take notice in the above suit the Hon'ble Court was pleased to order notice through publication by way of substitute of service to 7th and 10th defendants and posted the matter to **30-09-2024** to present before the Hon'ble Court at **10:30 A.M** either in person or through Pleader otherwise, the matter would be decided on its merits.

B. RAVINDRA KUMAR,
Advocate
Visakhapatnam,
Cell: 9440000109.

Vizianagaram
Dt.06-09-2024